
కథ




# పాలపుంత

- కొండవీటి సత్యవతి

‘‘నందూ! మనం చూద్దామనుకున్న జాగర్స్ పార్క్ జీటీవీలో వస్తోంది చూడు.’’

‘‘అవునా? నువ్వేం చేస్తున్నావిపుడు?’’

‘‘నీతో మాట్లాడుతున్నా’’

‘‘అబ్బో! జోకా?’’

‘‘పో... పోవోయ్ ఇంటికెళ్లి సినిమా చూడు.’’

‘‘ఏ ఇంటికి?’’

‘‘ఏదో నీ ఇంట్లో చూడు ఫోన్ పెట్టేస్తున్నా’’

‘‘నీ ఇంటికే వస్తున్నా...కాచుకో’’

‘‘నిజంగా’’

‘‘అబద్ధంగా’’

''చచ్చేపనుందని నిన్న ఊదరగొట్టావ్''

''నీ దగ్గరకొచ్చి బతుకుదామని''

''రా మరి''

''తలుపు తియ్యిమరి'' కాలింగ్ బెల్ మోగింది.

డోర్ తీస్తుంటే అతనికంటే ముందర పొగడ పూల పరిమళం లోపలకొచ్చి గదినీ, ఆమెనీ కూడా చుట్టేసింది.

''దోసిలి పట్టు''

దోసిలి నిండా పొగడపూలు పోశాడు.

ఇన్ని పూలు ఎక్కడివి నందూ''

''చెట్లవి''

''పొగడపూలు చెట్లకి పూస్తాయా? హృదయానికి అనుకున్నా''

''లుంబినీలో దొంగతనం చేశా''

దోసిలి అలాగే వుంచి చేతులు చాపింది.

ఆరడుగుల మనిషి అందంగా వొంగి ఆమె దోసిట్లో ముఖాన్నాన్చాడు. ఆ ఆనందాన్ని తట్టుకోలేనట్లుగా కొన్ని పూలు కిందకి జారిపోయాయి.

మెల్లగా ఆమె చుట్టూ చేతులేసి

''ఐలవ్ యూ మధూ''

''నా కోసం ఈ పూలన్నీ ఏరుకొచ్చావా?''

''నీ కోసం కాదు.''

''మరి?''

''నా కోసమే''

''అదేంటి?''

''నీ దోసిట్లో పోసినప్పుడు నీ ముఖంలోని సంతోషాన్ని చూడ్డం కోసం.''

''అంత ప్రేమా?''

''ఇంత ప్రేమ'' అంటూ గట్టిగా ఆమెను హత్తుకున్నాడు.

ఆ ఊపులో పూలన్నీ నేలమీద రాలిపోయాయి.

''అన్నీ కిందపడిపోయాయి ఫో...''

''మనం కూడా కిందపడితే సరిపోతుంది కదా?''

ఫక్కున నవ్వింది మధుర. ఆమె నవ్వులోని కాంతి అతని ముఖం మీద ప్రతిఫలించింది. బుద్ధిమంతుడిలా పూలన్నీ ఏరి టేబుల్ మీద పోసాడు.

''మన పరిచయమై ఆరునెలలా? అరవై సంవత్సరాలా మధూ''

''ఓయ్! నాకు నిండా మూడు పదుల్లేవు''

''అయినా టీనేజ్ అమ్మాయిలా ఇంత అందంగా ఎలా వున్నావ్?''

''వయసుకి, అందానికి సంబంధమేమిటి?''నవ్వింది.

''ఇంత అందంగా హాయిగా ఎలా నవ్వగలవ్ నువ్వు?''

''నవ్వడానికి హద్దులున్నాయా నందూ?''

''హద్దుల్లేవుగానీ ఆంక్షలున్నాయిగా''

''ఇక ఏ ఆంక్షలకీ లొంగేదాన్ని కాదు.''

''నాకు తెలుసుగానీ నీకింత లైవ్లీనెస్ ఎలా అబ్బింది?''

''జీవితం నేర్పింది''

''ఈ జీవితమా? గత జీవితమా?''

''గత జీవితంలో నుండి నేర్చుకున్న గుణపాఠమే ఈ కొత్త జీవితం''

''నిన్నెప్పుడూ దిగులుగా, దుఃఖంగా చూడలేదునేను.''

''నేను దుఃఖసాగరాల్ని, చీకటి అమావాస్యల్ని దాటి వచ్చేసాను. ఇప్పుడంతా పున్నములే, వెన్నెల స్నానాలే''

''నువ్వు మాట్లాడుతుంటే హాయిగా, రిలాక్సింగ్‌గా వుంటుంది.''

''నన్ను పొగడ్డమే పనిగా పెట్టుకున్నావా? ఈ రోజు? సినిమా చూడ్డానికి వచ్చి ఈ పనిలో పడ్డావేంటి నందూ''

''ఇది పొగడ్త కాదు. నీ సామీప్యత నాకు కలిగిస్తున్న పారవశ్యం. నువ్వు అడుగుపెట్టినంత మేరా నా జీవితం సంతరించుకున్న పచ్చదనం. సినిమా చూసే మూడ్ పోయింది గానీ నీ నవల ఎంత వరకు వచ్చింది?''

''ఇవాళ ఏమీ రాయలేదు. నువ్వు కవిత్వం చెప్తున్నావే?''

''కవిత్వమా? నేనే...నా ముఖం లే. నువ్వెందుకు రాయలేదు?''

''ఆఫీసులో కొంచెం బిజీ. ఇంటికొచ్చేసరికి బాగా అలసిపోతున్నా.''

''వంట్లో బాగానే వుంది కదా!''

''బాగానే వుంది. డోన్ట్ వర్రీ అలసట. అంతే''

''ఇలా అయితే ఎప్పటికి పూర్తవుతుంది?''

''ఏమో! తెలియదు.''

''అదేంటి? టార్గెట్ లేదా?''

''సృజనాత్మకతకి టార్గెట్లుండవు బాబూ! ఇదేమైనా ఆఫీస్ ప్రాజక్టనుకున్నావా? ఏదో ఒకటి రాసేయడం నాకిష్టం లేదు.''

''నాకేం తెలుసు చెప్పు. నేనేమైనా రైటర్‌నా?''

''టైమ్ చాలడం లేదు. టైమ్ దొరికినప్పుడు మూడ్ వుండడం లేదు.''

''సరే తల్లీ! నీ నవల. నీ ఇష్టం. తిండానికేమైనా వుందా?''

''ఆకలిగా వుందా? ఇంకా ఏమీ వండలేదు.''

''వండుకుందాం పద''

''ఫ్రిజ్‌లో కూరలున్నాయి. అన్నంపెడితే చాలు.''

''అయితే నేను కుక్కర్ పెడతాను. నువ్వు కూరలు తీసి ఓవెన్‌లో వేడి చేసేయ్''

''సరే! అన్నం అయ్యేలోపల స్నానం చేద్దామా?''

''సరిగంగ స్నానాలా?''

''లేదు జలపాత స్నానాలు''

''జీవితంలో ఇంత సంతోషముంటుందని నిన్ను కలిసాకే నాకు తెలిసింది మధూ''

''సంతోషం ఎప్పుడూ మన చుట్టూనే వుంటుంది. దాన్ని గుర్తించడంలోనే వుంది మన తెలివంతా.''

''నిజమే! జలపాత స్నానాలకి జలపాతాల దగ్గరికే వెళ్లనక్కర్లేదు. ఫోర్స్‌గా వస్తున్న ఈ షవర్ చాలదా?''

''ఆ థ్రిల్ వేరులే.''

''థ్రిల్ వేరేగానీ ఈ దగ్గరతనం అక్కడ కుదరదుగా! తలకోన జలపాతాలు అద్భుతంగా వుంటాయట. వీకెండ్‌కి వెళదామా? మధూ.''

''నీతో రావడానికి ఎక్కడికైనా, ఎప్పుడైనా నేను రెడీ నందూ''

''ఎక్కడికైనా వస్తావా?''

''ఆహా! ఎక్కడికైనా సరే. ఆకాశం అంచులదాకా రమ్మన్నా వస్తాను''

''నా మీద అంత నమ్మకమా?''

''నా మీద నాకు నమ్మకం.''

''నా మీద ప్రేమేనా?''

''మన బంధం మీద నమ్మకం, ప్రేమ.''

''ఈ బంధాన్ని ఏమంటారు?''

''నాకూ తెలియదు. లివింగ్ టు గెదర్ హేపీలీ.''

''నీకు భవిష్యత్తు గురించి భయం లేదా?''

''ఎవరి భవిష్యత్తు?''


''మనదే''

''ఇప్పుడేమైంది మన భవిష్యత్తుకి?''

''ముందు ముందు ఏం జరుగుతుందో...''

''నాకలాంటి భయాలేం లేవు నందూ. దేన్నయినా ఎదుర్కొవడానికి నేనెప్పుడూ సిద్ధమే.''

''ఈ చిన్ని గుండెలో అంత నిబ్బరం ఎక్కడ వుంది? ఎలా వచ్చింది నీకు?'' గుండె మీద ముద్దు



పెట్టాడు.

"జీవితమే నేర్పింది." తడిగా వున్న అతని పెదాల మీద మధురంగా తన పెదాలాన్చింది. స్నానాలు ముగించి బయటకొచ్చారు.

"అన్నం అయ్యింది తిందామా?"

"నీకు బాగా ఆకలవుతున్నట్లుంది. సారీ. ఆలస్యమైంది."

"ఏం ఫర్వాలేదులే మధూ. బయట వాతావరణం మారినట్లుందే."

"అవును. వాన వచ్చేట్టుగా వుంది."

ఆకాశం నిండా నల్ల మబ్బులు. ఉరుములు. మెరుపులు. బాల్కనీలో నిలబడ్డారు. వర్షం మొదలైంది. ఎండాకాలపు వానకి తడిసి మట్టి కమ్మటి వాసనేస్తోంది.

"వానలో తడుద్దామా?" మధుర.

"జలుబు, జ్వరం లాంటి ఏమీ రావుగా"

"వస్తే రానీ. నాలుగు రోజులు తుమ్మితే నష్టమేమీ లేదు లేవోయ్! వానలో తడుస్తూ ఐస్‌క్రీమ్ తినడం భలే బావుంటుంది."

"యూ ఆర్ సో డిఫరెంట్."

"ఎలా?"

"వర్షంలో తడవడమే భయం. మళ్లీ చల్లగా ఐస్‌క్రీమ్ తినడం."

"నీకు ఇన్ని భయాలున్నాయా నందూ" అల్లరిగా నవ్వింది.

"నాకేం భయాలు లేవు. పద వెళదాం"

"నీకు రోషమొచ్చినప్పుడు భలే ముద్దొస్తావ్ నందూ" అంటూ ముద్దు పెట్టింది. నవ్వేసాడు. "పద వెళదాం మరి."

ఫ్లాట్‌కి తాళం వేసి లిఫ్ట్‌లో కిందకి దిగారు.

"వాన బాగానే పడుతోంది మధూ."

"అందుకేగా బయటకి వచ్చాం."

"బైక్ మీద వెళదామా? కారులోనా?"

"కారులోనే వెళదాం. మధ్యలో ఆపి నడుద్దాం."

"ఓకే. డన్. నువ్వు నడుపుతావా? నేను నడపనా?"

"నువ్వే నడుపు. నేను వానని ఎంజాయ్ చేస్తాను."

టేప్ రికార్డర్ ఆన్ చేసింది. జగ్‌జీత్ సింగ్ గజల్స్. జోరున కురుస్తున్న వర్షం మంద్రంగా, మధురంగా విన్పిస్తున్న జగ్‌జీత్ సింగ్ గళం. కొంత దూరం వెళ్లాక...

"ఇక్కడ ఆపు నందూ! కొంచెంసేపు నడుద్దాం."

ఆ వానలో మధుర చేతిలో చెయ్యేసి నడవడం చాలా థ్రిల్లింగ్‌గా అన్పించింది నందూకి.

"తడిసిపోయేవేవీ జేబులో లేవుగా నందూ! నేనయితే ఏమీ తెలీదు."

"ఏమీ లేవులే. పర్స్ కారులోనే పడేసాగా." ధారలుగా కురుస్తున్న వాన. ఇద్దరు మొత్తం తడిసి పోయారు.



## మైక్రో ఓవెన్‌తో బ్యాక్టీరియా అంతం

ఇంట్లో శుభ్రతకి ఉపయోగించే స్పాంజిలపై పేరుకుపోయిన బ్యాక్టీరియాని అంతం చేయడానికి మైక్రో ఓవెన్ సరైన మార్గమని ఫ్లోరిడా విశ్వవిద్యాలయానికి చెందిన డాక్టర్ గాబ్రియెల్ బిట్టన్ అంటున్నారు. ఇంట్లోని కిచెన్‌తో పాటూ ఇతర ప్రాంతాల్ని శుభ్రం చేయడానికి ఉపయోగించే స్పాంజిల్ని నాలుగు నుంచి పదిని ముషాల పాటు మైక్రోవేవ్ ఓవెన్ పైన ఉంచి తీస్తే బ్యాక్టీరియా అంతం అవుతుందని తమ పరిశోధనల్లో తేలిందని ఆయన పేర్కొంటున్నారు. ఓవెన్ నుంచి వచ్చే వేడి వల్ల 99శాతం క్రిములు నాశనం కావడం తమ పరిశోధనా బృందం పరిశోధనలో వెల్లడైందంటున్నారు. స్పాంజిల్లో బ్యాక్టీరియాతో పాటూ ఎలర్జీని, అనారోగ్యాన్ని కలిగించే కోలి, ఇ, ప్రోటోజోన్‌లు, పారసైట్స్ ఉన్నాయని, ఇవి ఎక్కువ ఉష్ణోగ్రతలో మనలేవని పరిశోధనలో తేలిందన్నారు. మైక్రోవేవ్ ఓవెన్ వల్ల తక్కువఖర్చుతో వీటిని శుభ్రం చేసుకునే వీలుందన్నారు. కాబట్టి మీ ఇంట్లో ఓవెన్ ఉంటే స్పాంజిల్ని దగ్గర పెట్టి వాటిని శుభ్రపరుచుకోండి.

"మనం పెళ్లి చేసుకుందాం మధూ"

"ఇప్పుడు బాలేదా? మీ వాళ్లు మన పెళ్లికి ఒప్పుకుంటారా?"

"ఒప్పుకోరు"

"మన మధ్య వయసు తేడా! అండ్ యూ ఆల్సో లాస్ట్ యువర్ హజ్బెండ్"

"సో వాట్? మగవాళ్లే ఎందుకు పెద్దవాళ్లయ్యుండాలి? చిమ్మ చీకటి లాంటి నా మొదటి పెళ్లి.... నా భర్త మరణం.... ఇందులో నా తప్పేముంది?"

"నేనెప్పుడూ అలా ఆలోచించలేదు మధూ. నీ బలమైన వ్యక్తిత్వం,నీ ప్రేమ, చైతన్యం ముందు అవన్నీ ఎందుకూ కొరగావు."

"నేను నా గత జీవితంలోని అంధకారంలోంచి బయటపడి వెన్నెల దారుల వెంట నడవాలనుకుంటున్నాను. నందూ! నీ స్నేహం, నీ ఆత్మీయత చాలా అపురూపం నాకు. ఈ చిన్ని జీవితంలో అప్పుడే ముప్ఫై యేళ్లు గడిచిపోయాయి. మిగిలిన జీవితాన్నయినా నా కిష్టమైనట్టు మలుచుకోవాలని ఆశ. నీ స్నేహ సాహచర్యంలో దాన్ని సాధించగలననే నమ్మకముంది నాకు." అతని చేయిని మృదువుగా నొక్కింది.

"మధూ! నీ సామీప్యత, స్నేహం నాకెప్పుడూ కావాలి. పెళ్లయితే నేను మారిపోతానని, మామూలు మొగుడు అవతారమెత్తుతానని నీ అనుమానం కదూ!"

"అలా అని నేన్నానా? అయినా అలాంటి సందర్భం వస్తే ఏం చేయాలో నాకు బాగా తెలుసు లేవోయ్! సహజీవనంలో స్నేహం కరువైతే నా దృష్టిలో అది వేస్ట్" కళ్లు మిరుమిట్లు గొల్పుతూ ఒక మెరుపు తీగ ఆకాశంలో పరుగులు తీసింది. ఆ వెంటనే ఫెళఫెళార్భాటాలతో ఉరుము ఉరిమింది.

"మధూ నేనెప్పుడూ ఇలాంటి వర్షంలో తడవలేదు. మా అమ్మ నన్ను వర్షంలో తడవనిచ్చేది కాదు. వానలో తడుస్తూ నడవడం ఇంత అద్భుతంగా వుంటుందని నాకు తెలియదు."

"జీవితంలోని చిన్న చిన్న ఆనందాలకి, సంతోషాలని మనం ఇలాగా కోల్పోతుంటాం. ఎవరో ఒకరు అడ్డుపడుతుంటారు."

"నాకు జలుబు చేసి జ్వరమొస్తుందని అమ్మ భయం."

ఒక్కోసారి ఏమీ కాకపోవచ్చు కూడా. ఏదో అవుతుందనే భయం మనల్ని పీడిస్తూ ఎన్నింటినో దూరం చేస్తుంది."

"వెనక్కి వెళదామా? వాన ఇంకా ఎక్కువ అవుతోంది."

"ఇప్పుడు వాన ఎక్కువైనా తక్కువైనా మనకి నష్టమేమిటి? మొత్తం తడిసిపోయాం కదా?"

"అవుననుకో. అయినా బాగా రాత్రయింది వెళదాం పద."

"సరే! నాకేమైనా అవుతుందని నీకు భయం మొదలైంది కదూ! ఏమీ కాదులే. అయినా ఎలాగూ రేపు డాక్టర్ దగ్గరకి వెళ్లాలిలే" వెనక్కి తిరిగి కారు వైపు నడక సాగించారు. ఇద్దరి మధ్య కొంచెం సేపు నిశ్శబ్దం అల్లుకుంది.

"ఏమాలోచిస్తున్నావ్ నందూ! సడన్‌గా కామ్‌గా అయిపోయావేమిటి?"

"ఎందుకో మన మొదటి పరిచయం గుర్తొకొచ్చింది."

"ఇంత సంతోషకరమైన వేళ అదెందుకు గుర్తుకొచ్చింది? డాక్టర్ దగ్గరకి వెళదామన్నాననా?"

"ఈ సంతోషం శాశ్వతమైతే ఎంత బావుంటుంది మధూ?"

"ఏది శాశ్వతం చెప్పు నందూ! ఈ క్షణంలో ఈ పిడుగులు మన మీద పడొచ్చు. ఏమైనా జరగొ

చ్చు.''

''నువ్వు చాలా ఫిలసాఫికల్‌గా మాట్లాడగలవు. నీకు రేపటి గురించి భయమేమీ లేదు.''

''భయం లేదని ఎలా అనుకుంటావ్? కానీ భయపడి ఏం చేయగలం? మిగిలిన కాలాన్నైనా సంతోషంగా గడపొచ్చు కదా!''

''పాజిటివ్స్ నెట్‌వర్క్ మీటింగ్‌లో నీ మాటలు విని నేను చాలా ప్రభావితమయ్యాను. అప్పటి వరకూ నాకు బతుకంతా నిరాశే. ఆత్మహత్య చేసుకోవాలని ఎన్నోసార్లు అనుకున్నాను. బైక్ యాక్సిడెంట్ అయినప్పుడు నాకు రక్తం ఎక్కించిన డాక్టర్లని రోజూ శపించేవాడిని. పిచ్చిగా ఏడిచేవాడిని. నీ పరిచయం నాలో తిరిగి జీవితేచ్ఛను రగిలించింది మధూ.!''

ఆమె గుప్పిట్లో అతని చెయ్యి వణికింది. కళ్లలోకి ఉబికొచ్చిన కన్నీళ్లు వానధారలో కలిసిపోయాయి.

''నేనూ చాలా ఏడ్చాను నందూ! విలువైన కన్నీళ్లని చాలానే ఒలకబోసుకున్నాను. నా మొగుడు ఆస్తిగా నాకు హెచ్ ఐవిని పంచి చనిపోయాడు. నా బిడ్డ కూడా పాజిటివ్‌గా పుట్టి చనిపోయింది. బతుకు నిండా చీకటి. కానీ నేను కూడదీసుకున్నాను. మిగిలిన జీవితాన్నైనా సంతోషంగా గడపాలనుకున్నాను. మనలాంటి వాళ్ల గురించి ఎన్నో పుస్తకాలు చదివాను. కొండంత ధైర్యమొచ్చింది. నీ పరిచయం, నీ స్నేహం నాలో అన్ని దిగుళ్లని దూరం చేసాయి నందూ!''

వర్షం కొంచెం తగ్గుముఖం పట్టింది. కారులో కూర్చున్నాక –

''ఐస్‌క్రీమ్ ఏది?''

''కొందాం. మరీ చిన్నపిల్లలా మారాం చేస్తావే.''

''నీ దగ్గర లేకపోతే ఇంకెవరి దగ్గర గారం చెయ్యగలను చెప్పు?''

ఐస్‌క్రీమ్ పార్లర్ దగ్గర ఆపి రెండు కోన్స్ కొనుక్కొచ్చాడు.

''మధూ! రేపు డాక్టర్ దగ్గరికి నేనూ వస్తాను. మనం వచ్చేవారం తలకోన వెళుతున్నాంగా''

''వెళదాం. నీతో ఎక్కడికైనా వస్తానని చెప్పాగా.''

''అలాగే తిరుపతికి వెళదామా?''

''ఎందుకూ?'

''పెళ్లి చేసుకుందాం?''

ఫక్కున నవ్వింది మధుర.

''ఎందుకు నవ్వుతావ్?''

''మనకెవడయ్యా తిరుపతిలో పెళ్లిచేసేది? ఇద్దరు హెచ్ఐవి పాజిటివ్‌లు. చిన్న పెళ్లికొడుకు, పెద్దపెళ్లికూతురు. పైగా భర్తపోయిన దానికి అక్కడ పెళ్లిచేస్తారని నీకు అంత నమ్మకమా నందూ?''

''ఏం? ఎందుకు చెయ్యరు?'' ఉక్రోషం ముంచుకొచ్చింది.

''నా పిచ్చి నందూ! నువ్వెంత అమాయకుడివి. అయినా మనం పెళ్లి చేసుకుతీరాలి అని ఎందుకు పట్టుపడుతున్నావ్?''

''కారణాలు నేను చెప్పలేను మధూ! నువ్వు దూరం అయితే నేను భరించలేను''

''నేనెందుకు దూరమవుతాను? ఇద్దరం ఒకే పడవలో కదా! ప్రయాణిస్తున్నాం. పెళ్లి చేసుకోకపోవడం అనేది నా దృష్టిలో అంత ముఖ్యమైనది కాదు. ఇద్దరి మధ్య స్నేహం, ప్రేమ, ఆత్మీయత బతికి వుంటే చాలు మనం బతికున్నంత కాలం హాయిగా వుంటాం. మనకి ఆ బలం చాలదూ?''

''నిజమే అనుకో. నీ ప్రేమే కదా నన్ను బతికిస్తోంది. నీ సాన్నిహిత్యం దూరమైతే నాకు ఇంకేం మిగలదు.''

''నందూ! మన సహజీవనాన్ని సంతోషమనే పునాది మీద పునర్నిర్మించుకుందాం. నేను నిన్ను దూరం చేసుకోలేను. మనం మనలాంటి వాళ్లకి ఆదర్శమవుదాం. వాళ్లకి ధైర్యాన్నివ్వడం కోసం పని చేద్దాం. సరేనా!'' నందూ చేతిని తన చేతిలోకి తీసుకొని సున్నితంగా నొక్కింది. ఇంటికొచ్చేసారు.

''కార్లో వెళ్లి కూడా ముద్దలా తడిసిపోయారేంటమ్మా''

వాచ్‌మెన్ ఆశ్చర్యానికి వారిరువురి నవ్వులే సమాధానం.

''ఏంటో... ఎందుకు తడిశారో. ఎందుకు నవ్వుతున్నారో'' ముసుగుతన్నాడతడు.

నందూ, మధుర ఫ్లాట్ తాళం తీసి లోపలికెళ్లి తలుపేసుకున్నారు.

★

